ఆహ్లాదకరం.. కృష్ణమ్మ జలవిహార్ పార్క్



నగరంలోని వారధి వద్ద నూతనంగా ప్రారంభించిన కృష్ణమ్మ జలవిహార్ పార్క్‌లో సందర్శకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో నగర వాసులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆహ్లాదంగా గడిపారు. కృష్ణానది ఒడ్డున చల్లటి వాతావరణంలో సేద తీరారు. రివర్ ఫ్రంట్ పార్క్ బోర్డు, సింహం విగ్రహాల వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









క్లుప్తంగా

20న అన్నమయ్య సంకీర్తనాగాన రవళి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఈ నెల 20వ తేదీన అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం ఆధ్వర్యాన అన్నమయ్య సంకీర్తనా గాన రవళి నిర్వహించనున్నట్లు పప్పు సదాశివశాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా బహుళసప్తమి మిగులు, శుద్ధ ఏకాదశి తిథులలో ఒక్కొక్క దేవాలయంలో అన్నమయ్య సంకీర్తనాగాన రవళి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు సంకీర్తన గాన రవళిని వీనుల విందుగా విని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు సీజనల్ పండ్లు, ఆహార పదార్థాలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఆరోగ్య అవగాహన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సమీపించిన దృష్ట్యా పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలని, ఎండలో తిరగకూడదని సూచించారు. ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయుర్వేదం, హోమియోపతి, అల్లోపతి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు నాట్యంలో శిక్షణనిచ్చి మెలకువలు నేర్పించారు. నీతి కథలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు వంటి పుస్తకాలు చదివించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు గ్రంథాలయాధికారి రమాదేవి బహుమతులు అందజేశారు.

సమస్యలే ప్రధాన అజెండాగా చేసేందుకు కృషి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన ఎన్నికల అజెండాగా చేసేందుకు యునైటెడ్ ఫోరం ఫర్ డెమొక్రసీ (యూఎఫ్‌డీ) కృషి చేస్తుందని ఫోరం రాష్ట్ర కన్వీనర్ ముహమ్మద్ జాహిద్ అన్నారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో వచ్చే ఎన్నికలకు సంబంధించిన ప్రజా మేనిఫెస్టోను కో–కన్వీనర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులతో కలసి ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కో–కన్వీనర్, హైకోర్ట్ అడ్వకేట్ పిచ్చుక శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ పార్టీలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసి విభజించాయని తెలిపారు. ఈ పదేళ్లలో ఒక్క విభజన హామీ కూడా అమలు కాకపోవడం శోచనీయమని చెప్పారు. గత దశాబ్దకాలంగా అనుసరించిన విధానాల వలన దేశం అస్తవ్యస్తమైందన్నారు. కో–కన్వీనర్ అడ్వకేట్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించిందని, దీనిని వినియోగించుకుని ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ అక్బర్ బాషా, సభ్యులు డీబీ సత్యనారాయణ, శ్రీనివాస్, లుఖ్మాన్, ముషాహిద్ బేగ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై అక్కసు

పెనమలూరు: ముస్లిం మైనార్టీల పట్ల చంద్రబాబు అక్కసు చూపుతున్నారని యునైటెడ్ ముస్లిం హెల్పింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాన్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన కానూరులో మాట్లాడారు. బీజేపీతో చంద్రబాబు అంటకాగుతూ సీఏఏ, ఎన్‌ఆర్‌సీలపై ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడటం దారుణమన్నారు. మహానేత వైఎస్సార్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టిన సమయంలో చంద్రబాబు నిరసనగా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందేనన్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు తెలిపారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద అమర గాయకుడు ఘంటసాల శత జయంతి వేడుకల ముగింపు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించాయి. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన మహనీయుడు ఘంటసాల అని చెప్పారు. ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ పాటల పూలతోటలో విరబూసిన మధుర స్వరం ఘంటల వెంకటేశ్వరరావు అని అభివర్ణించారు. కార్యక్రమంలో



ఘంటసాల శత జయంతి సభలో పాల్గొన్న చిట్టిబాబు, మల్లాది స్వాతి తదితరులు

గోళ్ళ నారాయణరావు, ప్రసూనా రామన్ ఘంటసాల సంగీత సేవలను వివరించారు. మల్లాది స్వాతి, మాధవి, మీనాకుమారి, మల్లీశ్వరి, రోజాలక్ష్మి, శేషగిరిరావు, కుమార్ గుప్తా, డేవిడ్‌రాజు, ప్రిన్స్ ఘంటసాల, క్లాసికల్ గీతాలను ఆలపించారు.

హెల్మెట్ ధరిస్తేనే జీవితాలకు రక్షణ

మైలవరం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి జీవితాలు కాపాడుకోవాలని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ క్యాంపు రెండో రోజు నిర్వహించారు. 'హెల్మెట్ వినియోగం–రోడ్డు ప్రమాదాల నివారణ' అనే అంశంపై కనిమెర్ల తండా పురవీధుల్లో కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మైలవరం సీఐ కే కిశోర్‌బాబు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు. కళాశాల ఎన్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ మరిప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. వలంటీర్లు వాహన చోదకులకు గులాబీ పూలు అందజేస్తూ హెల్మెట్ వాడాలని సూచించారు. కనిమెర్ల తండాలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

గన్నవరం: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు లౌకిక శక్తులు, ప్రజాస్వామ్య వాదులు ముందుకు రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు ధారదత్తం చేశారని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వం రైతులకు కోలుకోలేని దెబ్బ తీసిందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశం ప్రమాదంలో పడిపోవడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తులో ఉన్న టీడీపీ, జనసేనను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఆర్.రఘు, కళ్లం వెంకటేశ్వరరావు, ఎం.హరిబాబు, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సందడిగా పీవీపీ సిద్ధార్థ వార్షికోత్సవం

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి కాలేజీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన తర్వాత ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ఆర్ఎం వైస్ చాన్స్‌లర్ మనోజ్ కే అరోరా మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. నేడు సాంకేతిక రంగంలో అనేక నూతన మార్పులు వస్తున్నందున అధ్యాపకులు కూడా నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ నాగభూషణరావు, సహాయ కార్యదర్శి లలితప్రసాద్, డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీవీపీ సిద్ధార్థ కాలేజీలో డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్, పాటలు పాడి సందడి చేశారు.

స్పందన కార్యక్రమం రద్దు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నగరంలోని జోనల్ కమిషనర్ కార్యాలయాలు, సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

24న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహణ సేవా సంఘం ఆధర్యంలో ఈ నెల 24 వ తేదీ ఆదివారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తునట్లు ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకట దశరథ రమేష్, అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ అవకాశాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణ బంధువులు వినియోగించుకోవాలని కోరారు. పేర్లు నమోదుకు కన్వీనర్ సూర్యనారాయణ మూర్తి, 92461 93903 కో కన్వీనర్ భమిడిపాటి గణపతి 9866 936914 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

డీసీపీ హరికృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని డీసీపీ హరికృష్ణ తెలిపారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పారామిలటరీ, సివిల్ పోలీసులు ఆదివారం మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. బైపాస్ రోడ్డు , కబేళా తదితర ప్రాంతాల్లో బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా పారా మిలటరీ బలగాలు, సివిల్ పోలీస్ కవాతు నిర్వహించాయని పేర్కొన్నారు. ఈ కవాతులో వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి , వెస్ట్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న బలగాలు

దాహార్తి తీర్చడం ఉత్తమ సేవ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో బాటసారుల, పాదచారుల దాహార్తి తీర్చడమే కాకుండా బ్రెడ్ కూడా ఇవ్వడం ఒక చక్కని సేవా కార్యక్రమం అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు హజరతయ్య గుప్తా అన్నారు. ఆదివారం వాసవీ క్లబ్ విజయవాడ ఈస్ట్ కపుల్స్ ఆధ్వర్యంలో స్వర్ణ ప్యాలెస్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సేవా సంస్థ, ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రతి మనిషి సమాజసేవకి అంకితం అయితే అందరికీ మేలు చేకూరుతుందని చెప్పారు. మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి , గణేష్, రామచంద్ర రాజా, సాయిసునీత, ప్రభాకరరావు, శుభశ్రీ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న హజరతయ్య గుప్తా

ముగిసిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరిగాయి. అభ్యర్థులను క్షుణంగా పరిశీలించిన తరువాత మాత్రమే వారిని కేంద్రంలోకి అనుమతించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ అధికారులు సమన్వయంతో పరీక్షను విజయవంతం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





తాడిగడప ఆలయ భూములు కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామస్వామి దేవస్థానం ఆలయ భూములు టెండర్ కం బహిరంగ కౌలువేలం పాట వేయనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ ఆలయానికి ఆర్ఎస్ నంబర్ 106లో 2.81 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు నిబంధనలకు లోబడి వేలంపాటలో పాల్గొనవచ్చని అన్నారు.

సీఎం జగన్ సారథ్యంలోనే గిరిజనులకు సముచిత స్థానం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే గిరిజనులకు సముచిత స్థానం దక్కిందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి తోకల చిన వీరోజి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మానుపాటి నవీన్‌ను చిన వీరోజి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌ను వీరోజి శాలువాతో సత్కరించి, పూల మొక్కను బహుకరించారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్‌ను నవీన్ నెలకొల్పి, రాష్ట్ర నలుమూలల ఉన్న గిరిజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చారని, వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారికి ఏ అండగా నిలిచారన్నారు. గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉండే నవీన్‌ను ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



నవీన్‌ను సత్కరిస్తున్న వీరోజ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభ కార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీక రంజాన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మస్జిద్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ఇఫ్తార్ విందు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఇస్లాంలో రంజాన్ మాసానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రంజాన్ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిందని తెలిపారు. సమాజంలోని పేద, ధనిక వర్గాల మధ్య అంతరం లేకుండా అందరూ సమానమేనని రంజాన్ పండుగ వివరిస్తుందన్నారు. రంజాన్ మాసంలో చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం వలన అల్లాహ అనుగ్రహానికి పాత్రులవుతారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, అర్షద్, తాజ్ మస్జిద్ సెక్రటరీ షంషుద్దీన్, నాయకులు ఎస్‌కే నజీర్, బాజీ బాబా, రవూఫ్, సర్దార్ జానీ, ముజీబ్, జాహిద్, హమీద్, గౌస్, నయీమ్, ఎస్‌కే జిలాని, అస్గర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఆసిఫ్, కార్పొరేటర్ రెహమతున్నీసా, హయాత్